క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

కనుల పండువగా దీపారాధన



మంచు శివలింగం చుట్టూ ఏర్పాటు చేసిన దీపాలు

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీలో కాలనీ హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్, యువత ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా విశేషంగా దీపారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మంచు శివలింగం ఆకట్టుకుంది. 1008 దీపాలతో ఏర్పాటు చేసిన దీపారాధనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి



చెందిన దూబె (ఫైల్)

సబ్బవరం : మండలంలోని ఇరువాడ సమీపంలో జాతీయ రహదారిపై ఐసెర్ వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇరువాడ సమీపంలోని జాతీయ రహదారిపై రెస్ట్ ప్లేస్ వద్ద సంజయ్ రాహుల్ అనే వ్యక్తి దాబా నడుపుతున్నాడు.ఆ దాబాలో ఝార్కండ్‌కు చెందిన సంజయ్ దూబె (43) పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో 18వ తేదీ రాత్రి బహిర్భూమికి రోడ్డు దాటి వెళ్తున్నాడు. అదే సమయంలో అనకాపల్లి నుండి ఆనందపురం వైపు వెళ్తున్న ఐసెర్ కోళ్ల వ్యాన్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని స్థానికులు విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి అతను మృతి చెందాడు. దాబా యజమాని రాహుల్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రంగనాథం తెలిపారు.

యోగా కేంద్రం ప్రారంభం



యోగ సాధన చేస్తున్న విద్యార్థులు

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన యోగా కేంద్రాన్ని ఆంధ్రా యూనివర్సిటీ యోగా విలేజ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఒ.ఎస్.ఆర్.యు.భాను కుమార్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో గుర్తించబడిన పూర్వకాల భారతీయ ఆరోగ్య రహస్యం యోగా అన్నారు. అనంతరం యోగా గురు నరేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాల మెలకువలను నేర్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాళ్లు ఎ.బాలకృష్ణ, ఎస్.వి.కృష్ణ, వై.ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు రాజు

అక్కిరెడ్డిపాలెం: జాతీయ స్థాయి సివిల్ సర్వీస్ లాన్ టెన్నిస్ పోటీలకు షీలానగర్‌లోని గాజువాక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సబ్ రిజిస్ట్రార్ కె.రాజు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ లాన్ టెన్నిస్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

సంపూర్ణ అభివృద్ధే సీఎం ధ్యేయం

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- రూ. 82.60 లక్షలతో నిర్మించనున్న ఇస్సన్నపేట సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ : అన్ని రంగాల్లోను సంపూర్ణ అభివృద్ధే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. వాడచీపురుపల్లి శివారు ఇస్సన్నపేట గ్రామంలో పంచాయతీరాజ్ నిధులు రూ. 82.60 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయిస్తుందన్నారు. అందులో భాగంగా నియోజకవర్గంలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి నిధుల మంజూరుకు కృషి జరుగుతుందని చెప్పారు. శిథిలమైన పలు రోడ్లను గుర్తించి రిపేర్లు చేపట్టామన్నారు. మిగిలిన రహదారులకు త్వరలో రిపేర్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చెప్పారు. సీసీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు, పరవాడ ఎంపీడీవో వి.హేమసుందర్రావు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, జేసీఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, ఎంపీటీసీ గెద్దం పుష్ప, పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, గ్రామ కమిటీ కన్వీనర్ కూండ్రపు తాతాజీ, పార్టీ నాయకులు బొద్దపు చిన్నారావు, కె.సీతారామయ్య, పైల అప్పలనాయుడు, పెదిశెట్టి శేఖర్, కంచిపాటి భాస్కర్, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణపతి మండపాల వద్ద భారీ అన్నసమారాధన



ఇస్సన్నపేటలో ప్రతిష్ఠించిన వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి



అక్కిరెడ్డిపాలెంలో లిటిల్ గయ్స్ ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవం

పరవాడ: వినాయక నవరాత్రి వేడుకల్లో భాగంగా రెండో రోజు పరవాడ, నాయుడుపాలెం పంచాయతీలోని పలు గ్రామాల్లో వినాయక మండపాల వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా వాడచీపురుపల్లి దరి ఇస్సన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పరవాడ జగన్నాథం వీధిలో పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పార్టీ నాయకులు వర్రి హరి, పోతల అప్పలనాయుడు, పైడింనాయుడు పాల్గొని పూజలు జరిపారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు ప్రారంభించారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా నాయుడుపాలెం శివారు కిత్తప్పగారి ఊరు, మంగప్పయ్యగారి ఊరులో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

ఇద్దరు పేకాటరాయుళ్ల అరెస్ట్

సబ్బవరం: జీవీఎంసీ 88వ వార్డు వెదుళ్ల నరవ శివారులో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించి, నిందితుల నుంచి రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్న్‌షిప్‌తో ఉద్యోగావకాశాలు



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రేమకుమారి

మల్కాపురం: ఇంటర్న్‌షిప్స్‌తో నైపుణ్యాలు పెరిగి, ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయని మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి అన్నారు. కళాశాల ఆవరణలో బుధవారం డిగ్రీ ఫోర్త్ సెమిస్టర్ విద్యార్థినులకు నైపుణ్య ఆధారిత స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్స్ మూల్యాంకన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్‌ల వల్ల విద్యార్థుల్లో ప్రత్యక్ష జ్ఞానం పొంది, విషయ అవగాహన పెరుగుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించండి

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ సంస్థ విస్తరణ పనుల్లో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు బుధవారం హెచ్‌పీసీఎల్ సీనియర్ జనరల్ మేనేజర్(పీఆర్‌వో) కాళీ, అధికారులను కలిసి వినతిపత్రం అందజేసి సమస్య వివరించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ సుమారు రెండేళ్ల నుంచి విస్తరణ పనులు జరుగుతున్నాయని, వాటిలో స్థానికేతరులే అధికంగా పనిచేస్తున్నారన్నారు. హెచ్‌పీసీఎల్ సంస్థ కోసం మల్కాపురం చుట్టుపక్కల వాసులు తమ సొంత భూములను ఇచ్చారని, అలాంటి వారిని కాదని ఇతరులకు ఉపాధి కల్పించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. తమ సమస్యను పరిష్కరించాలని, లేకుంటే సంస్థ గేటు బయట ఉదమిస్తామని స్థానిక నిరుద్యోగులు హెచ్చరించారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని సదరు అధికారి హామీ ఇచ్చినట్లు దాడి సత్యనారాయణ తెలిపారు. పెద్దిరెడ్ల నానాజీ పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి అక్కినేని



ఏఎన్నార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోలా గురువులు, అభిమానులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే అక్కినేని యువసేన సభ్యులు.. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు జయంతి ఉత్సవాలను పాతపోస్టాఫీసు స్వామి వివేకానంద వృద్ధాశ్రమంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర సీమలో ఏఎన్నార్ మహోన్నతమైన వ్యక్తి అన్నారు.

పోస్టల్ శాఖ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలిలో తపాలా శాఖ ఆధ్వర్యంలో బుధవారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో తక్కువ ప్రీమియంతో అధిక బోనస్ ఇచ్చే ప్లాన్స్ ఉన్నాయని తెలిపారు. చిన్న చిన్న మొత్తాల్లో పొదుపు జమ చేసి భవిష్యత్ అవసరాలకు పెద్ద మొత్తంలో అందుకునేలా చాలా రకాల పొదుపు పథకాలు ఉన్నాయన్నారు. తపాలా శాఖ సీనియర్ మేనేజర్ కె.శ్రీదేవి, మేనేజర్ ఎస్.సంతోష్, ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ, పోస్ట్ మాస్టర్ బి.యేసు, సిబ్బంది తపాలా శాఖ అందిస్తున్న పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

సాఫీగా.. సురక్షితంగా ప్రయాణం

- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుల చర్యలు
- బీఆర్‌టీఎస్ రహదారుల్లో వాహనాల వేగానికి కళ్లెం
- స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్, స్టాపర్ల ఏర్పాటు



స్పీడ్ బ్రేకర్లను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

మర్రిపాలెం: ప్రయాణికులు, వాహన చోదకులు సాఫీగా.. సురక్షితంగా గమ్యాలకు చేరుకోవడానికి కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు.. వాహనాల మితిమీరిన వేగానికి కళ్లెం వేసేందుకు అనేక చర్యలు చేపడుతున్నారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో వాటిని నివారించేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్ లైన్లు, స్టాపర్లు ఏర్పాటు చేశారు.

'యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా'ల గుర్తింపు

కంచరపాలెం మెట్టు నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకు ఉన్న కూడళ్లలో 'యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా'లను కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. కరాస జంక్షన్ నుంచి మర్రిపాలెం దుర్గాలమ్మ గుడి, మర్రిపాలెం నుంచి 104 ఏరియా జ్యోతి నగర్ వద్ద, కంచరపాలెం జంక్షన్ నుంచి రైతుబజారు వద్ద ఉన్న దుర్గానగర్ కూడలి వద్ద ప్రమాద స్థలాలను గుర్తించి జీవీఎంసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వారి సహాయంతో మొత్తం 45 స్పీడ్ బ్రేకర్లను అమర్చారు. ప్రమాదాల నియంత్రణలో భాగంగా వైట్ పెయింట్‌తో పెడెస్ట్రియన్ క్రాసింగ్ లైన్స్, క్యాట్ఐస్, రోడ్డు డివైడింగ్ కంటిన్యుయేషన్ లైన్స్, రోడ్డు షోల్డర్ లైన్స్ తదితర వంటివి ఏర్పాటు చేశారు.

మధ్య రోడ్డులో ప్రయాణం.. ప్రమాదకరం

బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో కార్లు, బైకులు, ఆటోలకు అనుమతి లేదని నో ఎంట్రీ ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ రూల్స్ అతిగమిస్తూ వెళ్తే జరిమానాలు విధిస్తామని వాటిపై ఉంచారు. మధ్య మార్గంలో కేవలం బస్సులు, అంబులెన్సులు మాత్రమే ప్రయాణించాలని, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తే ప్రమాదాల బారిన పడుతున్నారనే విషయమై ట్రాఫిక్ పోలీసులు ఇటువంటి కఠిన చర్యలు చేపట్టారు. ఒకవేళ నిబంధనలు మీరి ఏ వాహనదారుడైనా మధ్య రోడ్డులో ప్రయాణిస్తే ట్రాఫిక్ డిసొబిడియన్స్ రూల్ కింద రూ.535, రూ.1,035 జరిమానాలు విధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గత ఐదేళ్లలో ప్రమాదాలు ఎక్కువగా జరిగిన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో ఇటువంటి చర్యలు చేపట్టామని చెబుతున్నారు. గతంలో జరిగిన ప్రమాదాలను హెచ్చరిస్తూ స్థాపర్లను కూడా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ అధికారులు ఏడీసీపీ జి.శ్రీనివాసరావు, ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని అధికారులు ఆకాంక్షిస్తున్నారు.

సురక్షిత ప్రయాణం శ్రేయస్కరం



వాహన చోదకులు సర్వీస్ రోడ్డులో ప్రయాణిస్తే గమ్యాలకు సురక్షితంగా చేరుకుంటారు. బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో ప్రయాణించడం వల్ల వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు మొత్తం 45 స్పీడ్ బ్రేకర్లు వేశాం. కొంచెం ట్రాఫిక్ కంట్రోల్ అయ్యింది. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ ఏడీసీపీ, ఏసీపీలు పర్యవేక్షిస్తున్నారు. వేగాన్ని నియంత్రించి, ప్రాణాలు కాపాడటమే ధ్యేయంగా చర్యలు చేపడుతున్నాం.

– మళ్ల అప్పారావు, ట్రాఫిక్ సీఐ, కంచరపాలెం

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



అసకపల్లిలో వరి క్షేత్రాలు పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకుడు రామారావు

సబ్బవరం: రైతులు తమ పంటలను విధిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని అనకాపల్లి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.రామారావు సూచించారు. మండలంలో పంటల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించడానికి వచ్చిన ఆయన.. నారపాడు, అసకపల్లి, సబ్బవరం గ్రామాల్లో బుధవారం పర్యటించారు. పంటలను క్షేత్ర పరిశీలన చేశారు. వరి పంటను విధిగా రైతులంతా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద పంట నమోదు చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లినా, ధాన్యం కొనుగోలుకు, పంట రుణాల కోసం ఈ పంట నమోదు తప్పనిసరని చెప్పారు. మండలంలో 7 వేల ఎకరాలకు 4,500 ఎకరాల వరకూ ఇప్పటికే పంట నమోదు పూర్తయిందని, మిగతా పంటలను కూడా త్వరితగతిన నమోదు చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు హరీష్, అలేఖ్య, జానకి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

సబ్బవరం: మండలంలోని ఇరువాడ గ్రామానికి వెళ్లే రోడ్డులోని పైప్‌లైన్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇరువాడకు చెందిన జెట్టి భీమస్వామి కుక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని సాకుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సొంత పనిపై సబ్బవరం వెళ్లి తిరిగి ఇరువాడ వస్తున్నారు. మార్గమధ్యలో హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ వద్ద ఎదురుగా వస్తున్న నెల్లి మాధవరావు ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో భీమస్వామి తల వెనుక వైపు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో సబ్బవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుండి విశాఖలోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి 108లో తరలించారు. కాగా భీమస్వామి అపస్మారక స్థితిలో ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రుడి భార్య సూరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రంగనాథం తెలిపారు.

ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన



పాడి రైతులకు మందులు అందిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి, తదితరులు

సబ్బవరం: అంతకాపల్లి గ్రామంలోని చింతల కల్లాల వద్ద బుధవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆజాదీకా అమృత మహోత్సవ్‌లో భాగంగా సమ్మిళిత వృద్ధి-పశుధన్ జాగృతి అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరం, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విశాఖపట్నంకు చెందిన సూపర్ స్పెషాలిటీ పశు వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, విశ్వవిద్యాలయ బోర్డు మెంబర్ వాసుపల్లి జానకిరామ్, ఎంపీపీ బోకం సూర్యకుమారి ప్రారంభించారు. ఈ శిబిరంలో 45 ఎదకు రాని పశువులకు, 56 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. 24 పశువులకు చూడి పరీక్షలు, 3 పశువులకు శస్త్ర చికిత్స, 44 పశువులకు వైద్య పరీక్షలను అందించడంతో మొత్తం 162 పశువులకు చికిత్సను అందించినట్లు అంతకాపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ జి.అరుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చోక్కాకుల గోవింద్, వైఎస్సార్ పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షులు కొటాన రాము, సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఇన్‌చార్జ్,,ఉప సంచాలకులు డాక్టర్ శ్రీకళ, వెటర్నరీ సర్జన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికుమార్, వెటర్నరీ గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకర్, విశాఖపట్నం డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ ఎస్.కరుణాకరరావు, విశాఖపట్నం లేబొరేటరీ ఉప సంచాలకులు డాక్టర్ మోహినీ కుమారి, సబ్బవరం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఉషా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి గీతాలపై పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సాహితీ స్రవంతి ప్రతినిధులు

మురళీనగర్: మహాకవి గురజాడ అప్పారావు జయంతి వారోత్సవాల సందర్భంగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో సాహితీ స్రవంతి సంస్థ, లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన 'గురజాడ ఆశించిన సమాజం ఫలించిందా?' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. విజేతలు పి.దిలీప్, ఎస్.ఎల్.ఎస్.వర్ధన్, టి.వైష్ణశ్రీ ,ఈ.రవళి, వై.వందనకు సాహితీ స్రవంతి ప్రతినిధులు, ప్రిన్సిపాల్ వెంకటరమణ బహుమతులు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి గురజాడ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, సిహెచ్.జయప్రకాష్‌రెడ్డి, సాహితీ స్రవంతి సభ్యులు ఎం.ఆనంద శర్మ, ఆంథోని, వెంకట్, వసంత కుమార్, పి.ఫ్రాన్సిస్, పి.రామారావు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గాజువాక: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం 'నారీశక్తి వందన్ అధినియమ్' పేరుతో తీసుకొచ్చిన మహిళా బిల్లుపై గాజువాక బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో పాతగాజువాకలో ర్యాలీ నిర్వహించి మిఠాయిలను పంచిపెట్టారు. అనంతరం కరణంరెడ్డి మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చారిత్రాత్మక బిల్లును తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు రోహిణి, జీలకర్ర భువనేశ్వరి, అనిత, రాజులమ్మ, బాటా శ్రీనివాస్, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, రాజశేఖర్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల నిర్వహణపై అవగాహన



ప్రైవేట్ పాఠశాలల నిర్వహణపై మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి

కూర్మన్నపాలెం: ప్రైవేట్ పాఠశాలల నిర్వహణకు సంబంధించి మండల విద్యాశాఖాధికారులు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కూర్మన్నపాలెం నిర్మల స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ సదస్సుకు గాజువాక మండల పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు హాజరయ్యారు. ఎంఈవో సునీత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల నిర్వహణపై అధికారులు వివరాలు తెలియజేశారు. మారిన విధానంలో అడ్మిషన్ రికార్డు రాసే విధానం, విద్యార్థులకు టీసీలు ఇచ్చే పద్ధతి, హాజరు నమోదు ప్రక్రియ, స్కూల్ నిర్వహణలో ఏ రికార్డులు ఎలా రాయాలో వివరించారు. అనంతరం ఉప విద్యా శాఖాధికారి ఎ.గౌరీశంకరరావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు, రెన్యువల్ ప్రక్రియను కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వం సూచించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలని, సెలవులు తు.చ తప్పకుండా పాటించాలని తెలికజేశారు. కార్యక్రమంలో జిప్సా అధ్యక్షుడు పి.భాస్కరరావు, ఎంఈవో విశ్వనాథం, అగనంపూడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, సీఆర్పీలు, జిప్సా కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ప్రతినిధులు సుమారు 80 మంది పాల్గొన్నారు.